# ఊరు ఊరుకోదు

అదుగో-ఆ కనిపించేదే ఊరు.

ఊరి పేరు దవనంపల్లి.

ఈ కాలిబాట వెంట పోతే నిండా ఆరమైలు లేదు, ఊళ్లోకి.

ఇది ఊడల మర్రి. ఇక్కడ నిలబడి చుట్టూ చూస్తే, ఉత్తరంగా కొండలూ, దక్షిణంగా పెద్ద చెరువూ, పడమర మశాణీల్లాంటి మరుభూములూ, తూర్పున పాడుబడిన శివాలయం కనిపిస్తున్నై.

ఇవే దవనంపల్లికి సరిహద్దులు.

వీటన్నిటి మధ్యగా-బీడులో తుప్పల్లా ఇళ్లున్నై.

దవనంపల్లి మీద, ఆకాశంలో-ఎప్పుడూ గొడ్డుమోతు మేఘాలు తిరుగుతూ వుంటై.

అందుకని అక్కడ ఏ సంవత్సరమూ పంటలుండవు. ఏ కాలంలోనూ నీటి ఎద్దడికి కరువుండదు: అందుకని ఇక్కడ రోజంతా కనిచీకటిగానే వున్నట్టుంటుంది.

ఊళ్లో జనం వున్నారుగానీ, మనుషుల్లేరు.

జనానికి ఇళ్లున్నాయి. ఆ యిళ్ళముందు పసులసావళ్లున్నై. ఆ సావళ్లల్లో మురికీ, కంపూ వున్నై. కుళ్లిన తాటిపండు మీద లుకలుకలాడుతున్నట్టు, పెంటపోగుల మీద దోమల కుటుంబాలున్నై.

అన్నీ ఇరుకు ఇళ్లూ. అందరివీ మురికి బతుకులూ.

జనం పుతికిన బట్టల్తో కనపడరు. మొగాళ్లు మోకాళ్ళదాకా పంచెలూ, బుజాన పైపంచెల్తో, చేతిలో కర్రల్తో తిరుగుతారు. ఆడవాళ్ళు చిరుగులుపడ్డ చీరే రవికల్తో శరీరాన్ని నిర్లక్ష్యంగా కప్పుకుంటారు.

ఊరిని ఏలుతుండే చీకటి జనం మనసుల్లోనూ మేటేసింది.

జనానికి మూఢ నమ్మకాలెక్కువ. పన్నెత్తితే తప్పు: కనురెప్ప కదిలిస్తే తప్పు. అందిరిదీ గుడ్డి బతుకు.

ఇంతెందుకు గానీయండి-ఒక్కమాటలో-సాటి ప్రపంచానికి ఇంకా ఏడుతరాల వెనకాతల వుంది, దవనంపల్లి.

ఈ 'చివురుపాతల, బరువూ బ్రతుకుల' జనమంతా బసవరాజు పొలాల్లో పనిచేస్తారు; లేకుంటే బసవరాజు లోగిల్లో పనిచేస్తారు; అదీకాకుంటే బసవరాజు చేసే అడ్డమైన పనులకూ పావులుగా వుపయోగపడతారు.

దవనంపల్లిలో పచ్చగా కనిపించేది ఏదివున్నా అదంతా బసవరాజు ఆధీనంలోనే వుంది.

ఇదిగో-ఈ పచ్చమేడ బసవరాజుది.

దాన్లో ఎన్ని గదులున్నాయో: ఏఏ గదుల్లో ఏఏ వస్తువులున్నాయో బసవరాజుకి నిఖరంగా తెలీదు. ఎప్పుడో పందొమ్మిదివందలాపదిలో వాళ్ళ తాత రంగూను చేకుతో, సున్నంలో కోడిగుడ్డు సొనకలిపి కోటలా ఆ మేడని కట్టించాడనీ; దానికి అప్పట్లో నలభై వేలు ఖర్చయిందనీ మాత్రం బసవరాజుకి తెలుసు.

పచ్చమేడకి ముందు రెండు ఫుట్‌బాల్ కోర్టులకి సరిపడాస్థలముంది.

ఆ స్థలమంతా నున్నగా మొద్దుగచ్చు చేయబడింది.

కుడిచేతి మూలగా పూల మొక్కలకి పక్కగా ఒక పొన్నచెట్టూ,

దాని చుట్టూ ఒక దిమ్మ వున్నై.

అతి ముఖ్యమైన వ్యవహారాల్ని ఈ దిమ్మమీద కూర్చునే ఆలకిస్తు వుంటాడు బసవరాజు.

అదుగో, బుంగమీసాన్ని సరిచేసుకుంటూ బసవరాజు ఇప్పుడు ఠీవిగా వాలుకుర్చీలో ముందు కూర్చుని వున్నాడు.

అతని ఎదురుగా నేలమీద ముగ్గురు నలుగురు పెద్దయ్యలు చతికిల బడి కూర్చున్నారు. వీళ్ళకి పక్కగా నిలబడి వున్నాడు చూడండి, అతనే హరిహరన్. అతనికి నాలుగువేపులా జనం వున్నారు. అతనిప్పుడుచేతులు కట్టుకుని బోనులో ముద్దాయిలా నిలబడివున్నాడు. కత్తిమొనకు గుచ్చిన జామ కాయలా వున్నాడతను!

పెద్దయ్యల్లో వొకాయన గొంతు సవరించి అన్నాడు,

"ఎవరో ఎక్కడి వాడో ఏమీ తెలీదు. నా వరకూ నాకు ఇష్టం లేదు."

చిందర వందరగా వున్న తలవెంట్రుకల్ని సరిచేసుకుని చుట్టూ చూశాడు-హరిహరన్. ఏదో చెప్పబోయాడు.

ఇంతలో ఎవరో అన్నారు, "కొత్తగా వచ్చినోణ్ణి నమ్మకూడదు"

విషపు బాణం నాటుకున్నట్టు బాధపడ్డాడు హరిహరన్. సన్నగా దగ్గేడు. గొంతు సరిచేసుకున్నాడు.

"వివరాలన్నీ చెప్పుకున్నాను. ఇంకేమైనా అనుమానాలుంటే అడ గండి, చెప్తాను." అని తలవంచుకుని నిలబడ్డాడు.

"అయితే నికరంగా నిజాయితీగా వుంటానంటావ్" కుర్చీలో ముం దుకూ వెనక్కీ మసలుతూ అడిగేడు బసవరాజు.

"అవునయ్యా" అంటూ వినయంగా జవాబిచ్చేడు హరిహరన్.

ఆ తర్వాత, పెద్దయ్యలంతా బసవరాజుతో తలోమాటా అన్నారు.

బసవరాజూ తన అభిప్రాయం చెప్పాడు. కొత్తగా వచ్చిన వాడైనా, మనిషి మంచి వాడుగానే కనిపిస్తున్నాడని వాళ్ళల్లోవాళ్ళు సరిపెట్టుకున్నారు. ఫర్వా లేదు ఊళ్ళో వుండనిద్దాం అనే తీర్మానం చేశారు.

అయ్యా—అదండీ విషయం.

దవనంపల్లిలో హరిహరన్ ప్రవేశం అలా జరిగింది. ఆ విధంగా హరిహరన్ దవనంపల్లిలో వైద్యుడులేని లోటుతీర్చడానికి పూనుకున్నాడు.

ఆ మర్నాడే—

ఒక పసులసాలలో తుప్పాకప్పు సరిచేసుకుని తను 'విడాదా' చేశాడు హరిహరన్.

ఒక బల్ల, ఒక టేబుల్, ఒక కుర్చీ, కొట్టాన్ని రెండుగా విడదీస్తూ ఒక తెర; ఆ తెరలోపల కొన్ని సీసాలు; రంగునీళ్ళ గాజు బ్యారెట్టులూ, ఒకటి రెండు చిన్న చిన్న చెక్కపెట్టెలూ-హరిహరన్ ఆస్తి.

'ఏం మందులు మీరిచ్చే ఈ మాత్తర్లు' అని అడిగిన వాళ్ళకి 'హోమ్యోపతీ' అనేవాడు.

'కీళ్ళనెప్పులకేం యిస్తారు?' అనే ప్రశ్నకి మూలికా వైద్యం చేస్తా ననే వాడు.

ఉష్ణం ఉగ్రంగా వుందంటే, ఫర్లేదు సూదేస్తానని సిరంజ్ అందు కొనేవాడు.

'అరవయ్యేళ్ళ అంకయ్య నాల్గో భార్యవల్లనైనా ఒక్క నలుసు కావాలండీ' అంటే-'డోన్ట్‌వర్రీ-సిద్ధమకరధ్వజం; ఊరపిచ్చుకల నత్తువ లేహ్యం' వాడదామనేవాడు.

ఈ మాటతీరు, చాకచక్యం-హరిహరన్‌ని అతి త్వరలోనే దవనం పల్లికి అప్తుణ్ణి చేసింది. అతని డాక్టర్ బోర్డుకి గిరాకీ కూడా బాగానే పెరి గింది. ఊళ్ళో జనం తామిప్పుడు మనుషులుగా మారడానికి బాగానే తపన

పడుతున్న సూచనలు బయటపడుతున్నై.

ఆర్నెల్లు గడిచినై.

హరిహరన్ బాగా రాటు తేలేడు. మనిషిలో దర్పం వచ్చింది. లోతుకుబోయిన కళ్ళు చురుకుదనాన్ని సంతరించుకున్నై. బుగ్గలు బూరెల్లా పొంగినై. నుదురులో ధళధళ వచ్చింది. శరీరానికి కండబట్టింది. అభిషేకం చేయించిన నల్లరాతి విగ్రహంలా వొక విగారింపు పొడసూపింది-శరీరంలో దవనంపల్లి నీళ్ళు బాగానే వొంటబట్టినై అతనికి.

ఇప్పుడు ఇస్త్రీగుడ్డలో మెరిసి పోతున్నాడతను. కళ్ళకి జోడూ వచ్చింది. కాళ్ళకు బూట్లు వచ్చినై. వారాంతాల్లో పట్నానికీ పయనాలు సాగుతున్నై. జేబులూ బరువుగానే వుంటున్నై.

ఆ వేళ—

రాత్రి భోజనం కానిచ్చి, ఆరుబయట మంచం మీద పడుకున్నాడు, హరిహరన్. ఇప్పుడతని భోజనం బసవరాజు ఇంట్లోనే. అందుకు ఆయనకి నెలకి యింత అని ముట్టచెప్తున్నాడు.

బసవరాజు తల్లి కూడా హరిహరన్ పక్కగా-కొంచెం దూరంలో గన్నేరు చెట్టుకింద మంచంలో పడుకుంది, ఆమె 80 ఏళ్ళ ముదివగ్గు. ఆకాశంలో మబ్బులు విబ్బరంగా కదులుతున్నై. చుక్కలు మిణుకు మిణుకుమంటున్నై.

హరిహరన్ మాట కలిపేడు. "రామాపురం మునసబు చౌదరిగారు తెలుసుగా-మామ్మగారూ"

"వాడెందుకు తెలీదయ్యా! మాము త్తవతల్లి మూడో అల్లుడి తమ్ముడేగా" అని మంచంలో లేచికూర్చుంది ఆవిడ.

"ఆయన కూతుర్ని నా కిస్తామంటున్నారు. ఆ పిల్ల బియ్యే చదివి హైదరాబాద్‌లో వుద్యోగం చేస్తా వుంది" అన్నాడు హరిహరన్.

ముసలావిడ ముందుకు జరిగింది. కళ్ళు చికిలించింది. మహదానందంతో సంబరపడిపోతూ, "మా నాయనే, మా బాబే—ఎంత చల్లటి వార్త చెప్పావు నాయనా" అంటూ పొంగిపోయింది.

మర్నాడు—

ఈ వివాహ వర్తమానం విని దవనంపల్లి జనం ఆనందానికి అవధి లేకుండా పోయింది. ఒక్కసారిగా కులమత వివక్షలూ, ప్రాంతీయభేదాలూ మరుగున పడినై. అది హరిహరన్ డాక్టరుగారి ప్రభావం మరి.

హరిహరన్‌ని అందరూ అభినందించారు. అతని మంచిదనాన్ని గురించీ: అతను ఆ వూరి వాళ్ళకి చేస్తున్న సేవగురించీ మళ్ళీ వోసారి పునశ్చరణ చేసుకుని సంబరపడ్డారు. బసవరాజూ, ఆయన మిత్రభృత్య పరివారమూ-తాము హరిహరన్‌ని దవనంపల్లిలో మకాంపెట్టడానికి అంగీకరించి ఎంతో మంచిపనే చేశామని తృప్తి పడ్డారు. అతనో యింటి వాడు కావడాన్ని-ఏతావాతా-అందరూ మనస్ఫూర్తిగా ఆహ్వానించారు.

ఈ వార్త నలుగురి నోళ్ళల్లోనూ నానుతూ వుండగానే వారం తిరిగొచ్చింది. ఆవేళ—

తెలతెల వారుతుండగానే ముస్తాబయ్యాడు, హరిహరన్.

బసవరాజు తల్లి దగ్గరికి వెళ్ళి ఆమె కాళ్ళకి దణ్ణంపెట్టి ఆశీర్వదించమన్నాడు.

ఆమె కళ్ళు చెమర్చినై. కారణం, బసవరాజు నుంచీ తన జీవితంలో ఆమె ఏనాడూ ఇలాంటి దణ్ణాలూ దస్కాలూ అందుకోలేదు.

మనస్ఫూర్తిగా దీవించి ఏంవిటి విషయమన్నది.

"ఇవ్వాళ ప్రధానానికి రామాపురంపోతున్నానన్నాడు" హరిహరన్. ఆమె కూడా రావాలన్నాడు. "మా నాయనే, మా బాబే" అనింది ఆమె. తాను రాలేనంది. సుఖంగా వెళ్ళి లాభంగా రమ్మని ఆశీర్వదించింది.

"పిల్లకి నగచేయిద్దామని కోరిక మామ్మగారూ. నమూనాగా చూపించి రావడానికి ఏదైనా మీ దగ్గరి గొలుసివ్వండి" అన్నాడు హరిహరన్.

ముసలావిడ కంగారుగా చుట్టూ చూసింది. అదృష్టవశాత్తూ బసవ రాజు లేడు. కోతల సమయం కావడంతో కళ్లంలోనే మకాం పెట్టాడు.

"దాన్దేముంది నాయనా. మనవరాలికి ఇట్టాంటి గొలుసు చేయించు" అంటూ భోషాణంలోంచీ మూడుపేట్ల బంగారు కొబ్బరితాళ్లు తీసి హరి హరన్ కిచ్చింది.

"మీరు కూడా వస్తే బాగుండేది" అవిగునుస్తూ, నసుగుతూ అయి ష్టాన్నీ, అసంతృప్తినీ-ప్రకటిస్తూ ఇవతలకొచ్చాడు హరిహరన్.

కరకరలాడుతూ సూరీడు పైకొచ్చాడు.

బసవరాజు ముందు ప్రత్యక్షమైనాడు హరిహరన్.

విషయమంతా వివరంగా చెప్పాడు ఆయనికి.

హరిహరన్ని తన ఊళ్లోవుండనిచ్చి ఇంతవాణ్ణి చేశాను చూశారా అన్నట్టుకళ్ళంలో పని చేస్తున్న వాళ్ళందరి ముందూమీసాలు దువ్వుకున్నాడు బసవరాజు.

యునానీ దేవతల్లా ప్రకృతి రహస్యాలన్నీ నా గుప్పిట్లో పెట్టు కున్నాను-చూశారా అని ఛాతీ విరుచుకున్నాడు కూడా. ఒక చేయి కూలోడి బుజం మీద వేసిలేస్తూ; మరో చేత్తో కర్ర పట్టుకుని నిలబడ్డాడు.

"ప్రధానపు వుంగరం పెట్టాలంట ఆ అమ్మాయికి" అన్నాడు హరి హరన్-తనలో తానే అనుకుంటున్నట్టు.

ఒక్క క్షణం కళ్లమూసి తెరిచాడు బసవరాజు. "చౌదరి మనకు బాగా కావాల్సినోడేలే, ఇంద. ఇది తీసికెళ్ళి పిల్లకు ఇవ్వు. మార్చి

చేయించుకోమను"

వేలినున్న వుంగరం తీసి హరిహరన్ చేతిలో పెట్టాడు బసవరాజు. హరిహరన్ కళ్ళు మెరిసాయి. తీసుకుని జేబులో వేసుకున్నాడు.

దవనంపల్లిలో కూడా మనుషులున్నారని నిరూపించారు-బసవ రాజూ, ఆయన తల్లీ.

సూట్‌కేసూ బెడ్డింగూ పట్టుకుని,

పదిగంటలు కావస్తూండగా దవనంపల్లి వదిలేడు, హరిహరన్.

ఈ పూట వస్తాడు, రేపు వస్తాడు-అని ఎదురు చూస్తూ కూర్చున్న బసవరాజుకీ, ఆయన తల్లికీ, గ్రామస్తులకీ-నిరాశే మిగిలింది.

వారం తిరిగేసరికీ రంగు తేలిపోయింది. చౌదరిని వాకబుచేస్తే "నీకు బుద్ధివుందా. ముక్కూ మొహం తెలీని వెధవకి నా కూతుర్నెలాకట్ట బెట్టాననుకున్నావ్?" అని బసవరాజుని నాలుగూ పెట్టేశాడు. "అసలు మీ వూళ్ళో హరిహరన్ అనే డాక్టరున్నట్టే మాకు తెలీదు" అన్నారుపొరుగు వూళ్ళవాళ్ళు.

హరిహరన్ సామానంతా సోదాచేసి అడ్రస్ తవ్వి తీశాడు, బసవ రాజు. కొత్తపేట అని వున్నటౌన్లూ, పల్లెలూ, పేటలూ-అన్నిటా వెతికించాడు. పోలీసులకి ఫిర్యాదుచేసి-దిగులుగా మిగిలిపోయాడు. చేతులు కాలేక అంతకంటే చేసేదేంవుంది మరి!!

"కొత్తగా వచ్చినవాణ్ణి నమ్మనే నమ్మకూడదు.తప్పు చేశాం మనం." అని పశ్చాత్తాపపడ్డారు బసవరాజూ, గ్రామస్తులూ!

నెలలు గడిచాయి. హరిహరన్ ఆచూకీ దొరకలేదు.

నగలకి నీళ్లొదిలేశాడు బసవరాజు. ముసలావిడని తిట్టేడు,కొట్టేడు. ఏడుస్తూ, వెక్కుతూ హరిహరన్‌ని శాపనార్థాలుపెట్టూ, కుక్కిమంచంలో కూలబడిపోయింది ముసలావిడ.

* * *

కథ ఇక్కడితో కంచికిపోతే-కథే అయ్యుండేది. దవనంపల్లి జనం జీవితం మరి వేరేవిధంగా వుంది.

ఏడాది తిరిగి ఎండాకాలం వచ్చేసింది. అరకొరగా వానలుపడి దవనంపల్లి మీద తిరుగాడే మేఘాల్ని ఆ ఏడు కాసింత చల్లబరిచినై.

ఓ సాయంకాలం—

అదుగో అటు చూడండి. ఊరుపూరంతా ఊడలమర్రి కిందచేరింది. జనమంతా తలోమాటా అంటున్నారు. అక్కడొకటే రొదగా వుంది. జనం మధ్యగా-పెడరెక్కలు విరిచి కట్టేయబడిన వ్యక్తి! ప్రాణం కళ్ళల్లో ఏలబడివుంది.

బసవరాజు భృత్యులు-అప్పటికే ఆ ఆగంతకుడికి దేహశుద్ధి చేసేశారు. దాని గురుతులు శరీరమంతా కనిపిస్తూనే వున్నై.

"చెప్పరా.. కొడకా... చెప్పు... నిజం చెప్పు" మరోసారి చెంప ఛెళ్ళుమంది. బసవరాజు కళ్ళు చింతనిప్పులు చెరుగుతున్నై.

"ఆడు చెప్పేదేంటిదొరా. ఈడు దొంగలంజాకొడుకు. పిల్లల్నెత్తుకుపోవడానికే వచ్చాడు."

"జాలి చూపిస్తే నెత్తికెక్కుతాడు. ఆ డాక్టరు ముండాకొడుకేం చేసిపోయాడో గుర్తు తెచ్చుకోండి"

ఎవరో అన్నారు. మరెవరో తీర్పు చెప్పారు. ఇంకెవరెవరో ఆజ్ఞ ఇచ్చారు.

దవనంపల్లి జనానికీ జ్ఞాపకం జాస్తి, "అవునవు" నని వంత పలికేరు. కసి రయ్యిమంది. దెబ్బ మీద దెబ్బ పడింది. అతని కళ్ళు మూతలుపడినై. మెడ వాలిపోయింది. పిట్టలు బెదిరిపోయి అరిచాయి. ఊడలమర్రి ఎర్రగా పగిలిన కాయల్ని రాల్చింది. అతను కుప్పలా కూలిపోయాడు.

కనిచీకటి పడింది. ఊరిని ఏలసాగింది చీకటి. ఊరిని ఏలుతుండే

చీకటి జనం మనసుల్లోనూ మేటేసింది. జనం మనసుల్లో మేటేసినచీకటి-మెడవాలి పోయిన ఆగంతుకుడి దేహం మీద తన నీడల్ని ప్రసరించింది. "స్పృహ వచ్చినాక పోతాడు పోనీండి" పక్కకి ఈడ్చేశారు.

గుడ్డి బతుకు జనమంతా ఇరుకు ఇళ్ళల్లోకీ, మురికిసాలల్లోకీ ముడుచుకు పోయారు. బసవరాజు మీసాలు దువ్వుకుంటూ పచ్చమేడలోకి నడిచి పోయాడు. ఆయన పావులన్నీ ఇళ్ళల్లో ఇరుక్కుపోయినై.

పెదవుల్ని తడి చేసుకుంటూ, కళ్ళరెప్పల్ని తాటించిన అతనికి కళ్ళ ముందు-తాను ఆ వూళ్ళో ప్రారంభించదలచిన పాఠశాల-లీలగా గోచరించింది. ఆ వెంటనే పలకా బలపం దృగ్గోచరమైనై. తన తప్పేమిటో తెలిసింది.

ఎందుకో ఏడవాలనుకున్నాడు. కళ్ళకు ఏమయిందో తెలీలేదు;ఏడుపు రాలేదు.

దవనంపల్లిలో జనం వున్నారుగానీ మనుషుల్లేరుగాక లేరు!!

అందుకనే—

సాటి ప్రపంచానికి ఇంకా ఏడుతరాల వెనకాతలే వుంది-దవనంపల్లి!! అక్కడ వెలిగే తొలివెలుగు కిరణం తానే కావాలని శక్తినంతా కూడ దీసుకుని లేస్తున్నాడు-అతను!!!